క్లుప్తంగా

బధిర విద్యార్థులకు దుస్తుల అందజేత

హనుమంతునిపాడు: కనిగిరి, చీమకుర్తి మండలాల్లోని మానసిక వికలాంగుల బధిరుల పాఠశాల విద్యార్థులకు చెక్కా నారాయణ లక్ష్మీదేవి దంపతులు దుస్తులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడు సాంబరెడ్డి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్

కనిగిరి రూరల్: కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ ఎస్ సూరిబాబు సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడారు. రికార్డులను, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెంట్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ అబ్దుల్ కలాం తదితరులున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గఫార్ డీసీహెచ్‌ఎస్ ఎస్ సూరిబాబు కలిసి పలు విషయాలపై చర్చించారు.

రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు

సింగరాయకొండ: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం పాకల, ఊళ్లపాలెంలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు. పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పాకల కేంద్రంలో 18 మంది ఉన్నారని వీరిలో 8 మంది పాకల గ్రామానికి చెందిన వారు కాగా, 10 మంది టంగుటూరు మండలం కేపుపాలెం గ్రామానికి చెందినవారని తెలిపారు. తీరప్రాంత గ్రామాలలో గర్భిణులను గుర్తించామని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆస్పత్రులలో చేర్పించామని వివరించారు.

దుకాణాలన్నీ తమ్ముళ్లకే..!

- 19 మద్యం దుకాణాల్లో 15 దక్కించుకున్న టీడీపీ శ్రేణులు
- పాత సిండికేట్‌కు చుక్కెదురు..తెరపైకి కొత్తముఖాలు
- బెల్టుషాపుల ఏర్పాటుతో ఏరులై పారనున్న మద్యం



కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం షాపుల లాటరీ విధానంలో ఎక్కువ శాతం దుకాణాలను తెలుగు తమ్ముళ్లే కైవసం చేసుకున్నారు. కనిగిరి సర్కిల్ పరిధిలోని 5 మండలాల్లో గల 19 షాపులకు 389 దరఖాస్తులు వచ్చాయి. అందులోని సుమారు 15 షాపుల వరకు తెలుగు తమ్ముళ్లకు దక్కినట్లు తెలిసింది. కనిగిరిలో ఎప్పుడూ మద్యం వ్యాపారంలో సిండికేట్‌గా వ్యవహరించే వారికి ఈ సారి చుక్కెదురైంది. గత టీడీపీ పాలనలో లిక్కర్ వ్యాపారం చేసిన పాత టీడీపీ నేతలంతా కలిసి సుమారు 40 వరకు దరఖాస్తులు చేయగా.. వారికి ఒక్కటి మాత్రమే దక్కినట్లు ప్రచారం జరుగుతుంది. ఇక సర్కిల్ పరిధిలోని కనిగిరి టౌన్, కనిగిరి రూరల్, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు మండలాల్లో షాపులకు అత్యధికంగా కొత్త ముఖాలు తెరపైకి వచ్చాయి. కనిగిరి మండల స్థాయి నాయకుడి ఒకరికి కనిగిరి టౌన్, రూరల్, సీఎస్‌పురంలలో కలిపి నాల్గు షాపులు వచ్చినట్లు తెలిసింది. హెచ్‌ఎంపాడు మండలంలోని రెండు షాపులు కూడా తెలుగు తమ్ముళ్లకే దక్కాయి.

ఇక ఊరురా బెల్టుషాపులు..?

కూటమి ప్రభుత్వం చేపట్టిన కొత్త మద్యం పాలసీతో ఇక తెలుగు తమ్ముళ్లు ఊరురా మద్యం బెల్టుషాపులు నడిపించేందుకు సిద్ధమవుతున్నారు. కూటమి సర్కార్ లోని గడిచిన 100 రోజుల పాలన గమనిస్తే.. మండలంలోని నందన మారెళ్ల జంక్షన్‌లో బెల్టుషాపులు ఎత్తి వేయాలంటూ మహిళలు రోడ్డెక్కి ధర్నా చేశారు. ఇక ఇటీవల పట్టణంలో మొబైల్ బెల్టుషాపు నిర్వహిస్తూ ఒక టీడీపీ కార్యకర్తను పోలీసులు పట్టుకున్నారు. పదిరోజులుగా ప్రతి రోజు వెలిగండ్ల, పీసీపల్లి, సీఎస్‌పురం, పామూరు మండలంలో ఏదో ఒక చోట మద్యం బెల్టుషాపుల షాపుల నిర్వాహకులను పోలీసులు పట్టుకుంటున్నారు. కనిగిరి మండలంలో తాళ్లూరు జంక్షన్‌లో సాయంత్రం అయితే చాలు మద్యం బెల్టుషాపుల నిర్వాహకులతో కళ కళ లాడుతుంది.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని మార్కాపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, వసతి, భోజన సౌకర్యం మూడు నెలల పాటు కల్పిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 లోగా httpr://janma bhoomi.ap.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్‌జీటీలకు ఇంటర్మీడియెట్‌తో పాటు డైట్, టెట్, స్కూల్ అసిస్టెంట్లకు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలని చెప్పారు.

ఎట్టకేలకు తొలగించారు..!



చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శి అంకయ్య

కొండపి: కొండపి–పెద్దకళ్లగుంట రహదారిలో అధ్వాన పారిశుధ్యంపై 'అధ్వానం..ఆలకించేవారేరి' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి అంకయ్య..పంచాయతీ కార్మికులతో వ్యర్థాలను శుభ్రం చేయించారు. చెత్తా చెదారం, మెడికల్ వ్యర్థాలతో నిండిపోయి రోడ్డులోకి వచ్చిన చెత్తను జేసీబీ సాయంతో తొలగించారు.

ఎంపీడీఓగా ప్రభాకర్‌శర్మ బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి: మండల పరిషత్ అధికారిగా ప్రభాకర్‌శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి బదిలీపై పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు వెళ్లారు. పెద్దారవీడు మండలంలో ఏఓగా పనిచేస్తూ బదిలీపై ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎడతెరిపి లేకుండా..



హెచ్‌ఎంపాడులో రోడ్లపై పారుతున్న వర్షం నీరు

టంగుటూరు: అల్పపీడనం ప్రభావంతో సోమవారం కుండపోత వర్షం కురవటంతో రహదరులు జలమయ్యాయి. మండలంలో 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పోతల చెంచయ్య కాలనీలో ఇళ్లలోకి వర్షం చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జయవరం ఎస్సీకాలనీలో ఇళ్లలోకి, రోడ్లపైకి వర్షం నీరు చేరింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి చేరు చేరింది. భారీ వర్షానికి పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏఓ స్వర్ణలత సూచనలు చేశారు.

హనుమంతునిపాడు: అల్పపీడన ప్రభావ,తో మండలంలో ఉదయం నుంచి వర్షంకురుస్తూనే ఉంది. వర్షానికి కుంటలు, చెక్‌డ్యాంలలోకి నీరు చేరింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండలంలో 23.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి మినుము, వరి మాగాణి, పొగనాట్లు, వేరుశగ పొలాల్లో నీరు నిలిచింది. వర్షం రెండు మూడు రోజులు కురిస్తే పొగనాట్లు, మొలక దశలో ఉన్న మినుములు, కంది పైర్లు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కనిగిరి రూరల్: నియోజకవర్గంలో రెండ్రోజులుగా ఎడతెరపి లేని నాన్పుడు వర్షం కురుస్తోంది. పట్టణ శివారు ప్రాంతాలన్నీ చిత్తడిమయంగా మారాయి. ప్రధాన పట్టణంలో కాలువల్లో నీరు బయటకు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం కంది, వరి, మినుము పంటకు మేలు చేయనుంది. పొగనాట్లు మరింత జోరందుకున్నాయి. కనిగిరి మండలంలో 31.4 మి.మీ, వెలిగండ్ల 27, హెచ్‌ఎంపాడు 23.6, పామూరు 24.8, సీఎస్‌పురంలో 40.8, పీసీపల్లిలో 36 మి.మీ వర్షపాతం నమోదైంది.

పొన్నలూరు: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని రోడ్డు జలమయం కావడంతో పాటు పంట పొలాలు, వాగులు, కుంటల్లోకి వర్షం నీరు చేరాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షం మెట్ట పైర్లుకు, పొగాకు నారుమళ్లకు బాగా ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 48.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొండపి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెట్లూరులో సోమవారం రూ.30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.4,500 కోట్లతో 30 వేల పనులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ ప్రసాద్, డీపీఓ వెంకట నాయుడు, సర్పంచ్ ఏ. ఝాన్సీరాణి, తహసీల్దార్ పి. మురళి, ఎంపీడీఓ రామాంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.